కంటోన్మెంట్‌లో ఏకగ్రీవానికి సహకరించండి

కాంగ్రెస్, బీజేపీలకు మర్రి విజ్ఞప్తి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఏకగ్రీవానికి సహకరించాలని కాంగ్రెస్, బీజేపీలకు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం బోయిన్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రావుల శ్రీధర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నివేదితతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఏడాది వ్యవధిలోనే సాయన్న, ఆయన కుమార్తె లాస్య నందితలు ఎమ్మెల్యే హోదాలోనే మరణించడం బాధాకరం అన్నారు. ఈ నేపథ్యంలో సాయన్న రెండో కుమార్తె నివేదితను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు ప్రధాన ప్రత్యర్థి పార్టీలు సహకరించాలన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో పాటు స్థానిక బీజేపీ, కాంగ్రెస్ నేతలైన రామకృష్ణ, మల్లికార్జున్, జంపన ప్రతాప్, మర్రి అమరేందర్ రెడ్డి, గొల్లకిట్టూ వంటి ప్రముఖులను కోరుతున్నానని అన్నారు.

'డబుల్' ఆరోపణాల్లో నిజం లేదు..

ఐదుసార్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా పనిచేసిన సాయన్నకు సొంతిల్లు కూడా లేదని, ఇదే ఆయన నిస్వార్థ సేవకు నిదర్శనమని మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. కంటోన్మెంట్‌లో డబుల్ బెడ్రూమ్ అమ్ముకున్నాడని సాయన్నపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. కార్యకర్తల పేరిట ఇళ్ల మంజూరుకు సాయన్న సిఫారసు చేయగా, దళారులు ఆ లిస్టులోని వారి నుంచి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. అవినీతి మరకలేని సాయన్న కుటుంబం నుంచి పోటీ చేస్తున్న నివేదితను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్నారు. ఈ సమావేశంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, పాండు యాదవ్, లోకనాథ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎస్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఆకుల హరి, నర్సింహ యాదవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయం ఖాయం: మైనంపల్లి


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మైనంపల్లి, శ్రీగణేష్

రసూల్‌పురా: కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అండగా ఉంటుందని మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మైనంపల్లి హన్మంతరావు పేర్కొన్నారు. తిరుమలగిరి లాల్‌బజార్‌లో కంటోన్మెంట్ అభ్యర్థి శ్రీ గణేష్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మల్కాజ్‌గిరి ఎంపీ స్థానంతో పాటు కంటోన్మెంట్ నియోజకవర్గంలో ప్రజల మద్దతుతో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముందు తిరుమలగిరి లాల్‌బజార్ మహంకాళి ఆలయంలో మైనంపల్లి, నీలం మధు, శ్రీగణేష్ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రంగా రవీందర్ గుప్తా, కొత్త సంజీవరెడ్డి, హరికృష్ణ పాల్గొన్నారు.

పార్టీలో చేరికలు

కాంగ్రెస్ పార్టీ కంటోన్మెంట్ అభ్యర్థి శ్రీ గణేష్ సమక్షంలో తిరుమలగిరి లాల్‌బజార్‌కు చెందిన మురళి ముదిరాజ్, భక్తవత్సలం, మధు, నగేష్ గౌడ్, రాజేందర్ సింగ్, సాయి యాదవ్, శివ భరత్, ఆనంద్ జైన్ కాంగ్రెస్‌లో చేరగా వారికి శ్రీ గణేష్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఆర్గానిక్ ఉత్పత్తులతో మేలు


మాట్లాడుతున్న హిమజ

అమీర్‌పేట్: ప్రస్తుత సమాజంలో తినే ఆహారం విషయంలో ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు తీసుకుంటున్నారని, ముఖ్యంగా ఆర్గానిక్ ఆహార పదార్థాల వినియోగం పెరిగిందని ఇది శుభ పరిణామమని సినీ నటి హిమజ అన్నారు. ప్రకృతి సంస్థ తొలి వార్షికోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని సంస్థ వెబ్‌సైట్‌తో పాటు మొబైల్ యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హిమజ మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువులతో పాటు తినే ఆహార పదార్థాలు, పండ్లలో విపరీతమైన క్రిమిసంహారక మందులు వాడటంతో ఆరోగ్యాలు పాడుతున్నాయని ఈ నేపథ్యంలో ఆర్గానిక్ ఉత్పత్తులు ఎంతో మేలు చేస్తాయన్నారు. సంస్థ సీఈవో రాం ప్రసాద్ మాట్లాడుతూ.. తమ రిటైల్ స్టోర్లు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకలలో కూడా ఉన్నాయని ఆర్గానిక్ ఉత్పత్తుల వినియోగించే వినియోగదారులతో పాటు వాటిని విక్రయించే రైతులు, డీలర్లకు ఉపయోగపడే విధంగా మొబైల్ అప్లికేషన్‌ను రూపొందించామన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న జబర్దస్త్ నటులు దొరబాబు, రైజింగ్ రాజు, శాంతిస్వరూప్, సంస్థ డైరెక్టర్లు జాఫర్, సాదిక్ షేక్, మనుగోలు సురేష్, శ్రీనాథ్‌రెడ్డి, అముశ్రీ, నర్మద, సుబ్బారావు పాల్గొన్నారు.

తలసీమియా నిర్మూలనే లక్ష్యం

రాంగోపాల్‌పేట్: భారతదేశంలో నుంచి 2035 వరకు తలసీమియాలను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యం పెట్టుకున్నట్లు తలసీమియా వారియర్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సందీప్ కావేటి, కృష్ణ వంశీ తెలిపారు.ఈ సంస్థ 4వ వార్షికోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ ప్యారడైజ్ ప్రాంతంలోని లయన్స్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో తలసీమియా చిన్నారులు వారి తల్లిదండ్రులు, బ్లడ్ వారియర్స్‌తో కలిసి సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తలసీమియాతో బాధపడుతున్న పిల్లలు ప్రతి రోజు తమ వ్యాధి గురించి మర్చిపోయి ఎంతో ఉల్లాసంగా జీవించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ వ్యాధితో బాధపడే చిన్నారులు ప్రతి 20 రోజులకోసారి రక్తమార్పిడి చేయించుకోవాల్సి వస్తుందని దీన్ని దృష్టిలో పెట్టుకుని ఒక్కో చిన్నారికి 10 మంది దాతల సహకారంతో రక్తదానం చేయిస్తుంటామని ఇప్పటి వరకు 1500 మంది దాతలు ముందుకు వచ్చారన్నారు.

మోదీని మళ్లీ ప్రధానిగా గెలిపించాలి


రోడ్ షోలో పాల్గొన్న కిషన్‌రెడ్డి, పక్కన మర్రి శశిధర్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్: రానున్న ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటేసి మోదీని మరోసారి ప్రధాన మంత్రి చేయాలని కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి కోరారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని సీసీనగర్, గాంధీనగర్, బోయిగూడ, భోలక్‌పూర్, ఐడీహెచ్ కాలనీ, బన్సీలాల్‌పేట్ ప్రాంతాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ నీతి నిజాయితీ, అవినీతి రహిత పాలనతో దేశాన్ని ప్రగతి పథంలోకి తీసుకెళ్లారన్నారు. నగరంలో కోట్లాది రూపాయల వ్యయంతో సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి, చర్లపల్లి రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్టును తలపించేలా నగరంలోని రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నట్లు వివరించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే కుటుంబ పాలన, అవినీతి, అక్రమాలు, కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. ఈ నెల 19న తాను సికింద్రాబాద్ ఎంపీగా నామినేషన్ వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రచారంలో మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, స్పందన, బీజేపీ నాయకులు శ్యాంసుందర్ గౌడ్, రాజశేఖర్ రెడ్డి, సురేష్‌కుమార్, శివలింగం, ఎస్. రాజు, వై. శ్రీనివాస్, ఉమేష్ ఖండెల్వాల్, గుంటి సత్యనారాయణ, లక్ష్మణ్, అండాలు, శేఖర్ పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్‌లోకి దిగి బాలుడి మృతి


కార్తికేయ (ఫైల్)

సనత్‌నగర్: స్విమ్మింగ్‌పూల్‌లో దిగిన ఓ బాలుడు మృత్యువాత పడిన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి వివరాల ప్రకారం..సనత్‌నగర్ సుభాష్‌నగర్‌కు చెందిన ఎస్.శ్రీనివాస్, మహేశ్వరి దంపతుల కుమారుడు కార్తికేయ అలియాస్ సోను (12) స్థానిక ఓ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. ఒంటిపూట బడులు కావడంతో మధ్యాహ్నం పాఠశాల నుంచి వచ్చిన కార్తికేయ స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడేందుకు లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌కు వెళ్లాడు. క్రికెట్ ఆడుతుండగా బాల్ పగిలిపోయింది. అయితే.. తరచూ అక్కడ క్రికెట్ ఆడేందుకు వచ్చేవారి బాల్స్ పక్కనే ఉన్న స్విమ్మింగ్‌పూల్‌లో పడుతూ ఉంటాయి. అక్కడ ఏమైనా బాల్ దొరుకుతుందేమోనని వారంతా భావించారు. సెలవు రోజు కావడంతో స్విమ్మింగ్‌పూల్ గేట్లు తాళాలు వేసి సిబ్బంది ఎవరూ లేరు. కార్తికేయ స్విమ్మింగ్‌పూల్ గోడ దూకి లోపలికి వెళ్లి స్విమ్మింగ్‌పూల్‌లోకి దూకాడు. ఎంత సేపైనా కార్తికేయ రాకపోవడంతో స్నేహితులు విషయాన్ని తల్లికి చెప్పారు. కుటుంబ సభ్యులు వచ్చి గేటు తెరిపించి చూడగా నీటిలో తేలుతున్న కార్తికేయ కనిపించాడు. వెంటనే అతనిని సమీపంలోని ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

సీతారాముల కల్యాణం చూతము రారండి!



- శ్రీరామనవమి వేడుకలకు సిద్ధం
- ముస్తాబైన ఆలయాలు
- పూర్తయి ఏర్పాట్లు



విద్యుద్దీపాలతో ముస్తాబైన సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం

సనత్‌నగర్: శ్రీరామ నవమి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. రాములోరి కల్యాణాన్ని వీక్షించేందుకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆయా ఉత్సవ కమిటీ నిర్వాహకులతో వివిధ కాలనీల అసోసియేషన్ల ఆధ్వర్యంలో శ్రీరామ నవమి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. సామూహికంగా భక్తులు సీతారాముల కల్యాణోత్సవాన్ని చూసి తరించేలా ఏర్పా ట్లు చేయడంతో పాటు భక్తులకు అన్నసంతర్పణ, పానకం, వడపప్పు ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిపే సన్నాహాల్లో మునిగిపోయారు.

- సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులు సీతారాముల కల్యాణాన్ని వీక్షించేందుకు దేవస్థానం ముందున్న గల రాంలీలా మైదానంలో ప్రత్యేక పందిళ్లు నిర్మించారు.
- జెక్‌కాలనీలో శ్రీసీతారాముల కల్యాణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం 7.20 గంటలకు ఒకటో వీధి నుంచి మూడో వీధి సన్‌రైజ్ పార్కు అపార్ట్‌మెంట్‌కు మంగళసూత్రములు, తలంబ్రాలు తీసుకురానున్నారు. ఉదయం 9 గంటలకు ఒకటో వీధిలోని సిల్వర్ స్ప్రింగ్ అపార్ట్‌మెంట్ నుంచి భక్తులందరూ కలిసి దేవతావిగ్రహాలను తీసుకురానున్నట్లు నిర్వహణ కమిటీ పేర్కొంది.
- బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ షాపర్‌స్టాప్ పక్కన అల్లావుద్దీన్ బిల్డింగ్ వద్ద సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు అమరం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.
- బేగంపేట అల్లంతోటబావిలోని శ్రీరామచంద్రస్వామి ఆలయంలో స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి తెలిపారు.
- సనత్‌నగర్ ఎస్ఆర్‌టీ కాలనీలోని భగత్‌సింగ్ గ్రౌండ్‌లో శ్రీరామదాస ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో, సుందర్‌నగర్‌లో సుందర భారతి కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో, మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సంస్కృతి కమ్యూనిటీహాల్‌లో శ్రీరామ నవమి వేడుకల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


అన్ని ఏర్పాట్లు చేయండి: తలసాని

సనత్‌నగర్: శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా వేలాదిగా తరలిచచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులకు సూచించారు. సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలో జరిగే సీతారాముల కళ్యాణ మహోత్సవానికి హాజరుకావాలని దేవాదాయ శాఖ తరుపున సోమవారం ఆయనకు ఆహ్వానం పలికారు. స్థానిక కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డితో కలిసి ఈఓ శ్రీనివాసరాజు, అర్చకులు పరాశరం రవీంద్రాచార్యులు, గణేష్‌కులకర్ణి, సూపర్‌వైజర్ శ్రీనివాస్, నాయకులు కొలను బాల్‌రెడ్డి తదితరులు ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు.


ఆహ్వానపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి

ఏర్పాట్ల పరిశీలన..

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ ముషీరాబాద్ చౌరస్తా సమీపంలోని సుప్రసిద్ధమైన శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ఈ నెల 17న జరిగే స్వామివారి కల్యాణోత్సవానికి ముస్తాబవుతుంది. అంగరంగ వైభవంగా నిర్వహించడానికి విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. వారాసిగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్, చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఆలయం ఈఓ శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ కె. హేమలత, జి. పవన్‌కుమార్ గౌడ్, ఏసూరి మహేష్ తదితరులు ఏర్పాట్లు పరిశీలించారు. దేవాలయం ఎదురుగా స్వామివారి కల్యాణం జరగనున్న నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లించాలని నిర్ణయించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొంటారని రద్దీకి అనుగుణంగా దేవాదాయ శాఖ నుంచి ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. అంతకు ముందు అధికారుల బృందం ఆలయ పరిసరాలు, ముషీరాబాద్ రోడ్డు ప్రాంతంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేషన్, లక్ష్మీపతి, శ్రీనివాస్ గౌడ్, పుష్పంత్‌రెడ్డి, కుషాల్, మహేందర్ గౌడ్, శివ ముదిరాజ్, ముక్కా శ్రీనివాస్, వెంకట్, శ్రీకాంత్‌రెడ్డి, నాగభూషణం పాల్గొన్నారు.


దేవాలయ ప్రాంగణంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

నేడు ఓయూలో రక్తదాన శిబిరం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో నేడు (16న) రక్తదానం శిబిరం జరగనుంది. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ, సైన్స్ కాలేజీతో పాటు ఇంజినీరింగ్ కాలేజీలలో ఉదయం 7.30లకు జరిగే రక్తదాన శిబిరాన్ని వీసీ ప్రొ.రవీందర్ ప్రారంభించనున్నట్లు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొ.నవీన్ తెలిపారు.

19న క్రష్డ్ సైలెన్సర్ల వేలం

సనత్‌నగర్: హైదరాబాద్ సిటీ పోలీసు చట్టం ప్రకారం బేగంపేటలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో ఉన్న వివిధ మోటార్ బైక్‌ల క్రష్డ్ సైలెన్సర్లను వేలం వేసేందుకు ప్రతిపాదించడం జరిగిందని అడిషనల్ డీసీపీ రంగారావు తెలిపారు. ఈ నెల 19న ఉదయం 10.30 గంటలకు చట్టపరమైన విధానాలకు అనుగుణంగా వేలం జరుగుతుందన్నారు.

పరామర్శ

బన్సీలాల్‌పేట్: అనారోగ్యానికి గురై చికిత్స పొంది ఇంటికి వచ్చిన సికింద్రాబాద్ మోండా మార్కెట్ డివిజన్ బండిమేట్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు శ్రీనాథ్‌ను సోమవారం ఎమ్మెల్యే తలసాని పరామర్శించారు. ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని అన్ని విధాలా తాను ఉన్నానని భరోసా కల్పించారు. త్వరగా కొలుకొని ప్రజాజీవితంలో మరింత ఉత్సాహంగా పని చేయాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆకాంక్షించారు. నాయకులు, కార్యకర్తలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

అనారోగ్యంతో బాలిక మృతి

అడ్డగుట్ట: కడుపు, ఛాతీ నొప్పితో బాధపడుతున్న ఓ బాలికను ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన తుకారాం గేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు వివరాల ప్రకారం.. తుకారాంగేట్ ప్రాంతానికి చెందిన మైనర్ బాలిక(13) స్థానిక ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి చదువుతుంది. ఆదివారం రాత్రి సమయంలో బాలికకు కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది.


జీహెచ్‌ఎంసీలో విలీనంతో ప్రయోజనాలు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడం ద్వారా స్థానికులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్ అన్నారు. సోమవారం మహేంద్రాహిల్స్ రవి కాలనీలో స్థానిక కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో భేటీ అయ్యారు. శ్రీగణేష్ మాట్లాడుతూ.. నియోజవర్గంలోని తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల వంటి సమస్యలతో పాటు కంటోన్మెంట్ పరిధిలో గృహనిర్మాణ అనుమతుల ప్రక్రియ సరళతరం చేసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. సంజీవ రెడ్డి, బల్వంత్ రెడ్డి, కార్తీక్, రవి కుమార్, నర్సింగ్ రావు, కోటేశ్వర రావు, బీబీరెడ్డి, ఎఎస్ రెడ్డి, వీఎస్ రావు బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మన రాజ్యాంగం విశిష్టమైంది

సికింద్రాబాద్ : ప్రపంచంలోని అన్ని దేశాల రాజ్యాంగాల కన్నా మన రాజ్యాంగం విశాలమైనదని, స్పష్టత కలిగినదని సికింద్రాబాద్ ఒకటో అదనపు చీఫ్ జడ్జి జీవన్‌కుమార్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడు వై.వసంత్ కుమార్ మాట్లాడుతూ.. రాజ్యాంగ విశిష్టతల పట్ల అవగాహన కలిగి ఉన్న న్యాయవాదులు అంబేడ్కర్ ఆశయాలు, ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి సునీల్ కుమార్, మహిళా ప్రతినిధి పుష్పలతా, కమిటీ సభ్యురాలు సౌమ్య, హిమవర్ష, న్యాయవాదులు కొమరయ్య, రాజేష్, జయరాజు, జనార్ధన్ రెడ్డి, దేవేందర్ బాబు, వినోద్, శ్రీరాములు, బాలేష్, నిర్మల్ కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతాం


మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

రసూల్‌పురా: పార్లమెంట్ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వు మూడు స్థానాల నుంచి ఒక అభ్యర్థిని కూడా ప్రకటించకుండా మాదిగల పట్ల వివక్షత చూపుతున్న కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు. కంటోన్మెంట్ రాయల్ లీ ప్యాలెస్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. రెండు రోజుల క్రితం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉందని ప్రకటించడంతో పాటు మాదిగలకు భవిష్యత్‌లో నామినేటెడ్ పదవులు ఇస్తామని చెప్పి అవమానించారన్నారు. ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉన్నట్లయితే ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉన్న మాలలకు చట్టసభల్లో కాంగ్రెస్ ప్రాతినిధ్యం ఎందుకు కల్పిస్తుందో సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు రాకుండా కాంగ్రెస్ గోబ్యాక్ అంటూ పల్లెల్లోకి రాకుండా కార్యచరణ రూపొందిస్తామన్నారు. గోవిందు నరేష్ మాదిగ, ఇటిక శ్రీ కిషన్ మాదిగ, నర్సింహా , మల్లికార్జున, అజిత్ వాలీ్మకి, బుర్రి సతీష్, కొమ్ము శేఖర్, కాంపల్లి శ్రీకాంత్, మంద మధుకర్ మాదిగ పాల్గొన్నారు.

మహిళతో అసభ్యకర ప్రవర్తన.. యువకుడికి జైలు


నదీమ్‌అలీ

చిలకలగూడ : మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడికి వారం రోజులు జైలుశిక్ష విధించిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌హెచ్‌ఓ అనుదీప్, ఎస్ఐ కిషోర్ వివరాల ప్రకారం..అడ్డగుట్ట తుకారంగేట్‌కు చెందిన ఎస్‌కే నదీమ్‌అలీ (22) ఆటోడ్రైవర్. గతనెల 23న రాత్రి సమయంలో ఓ మహిళ విధి నిర్వహణ ముగించుకుని క్యాబ్‌లో వచ్చి పద్మారావునగర్‌లో దిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తోంది. అదే సమయంలో ఆటోతో వచ్చిన నదీమ్ అలీ ఆమె వెనుకభాగంలో తాకి అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించి నదీమ్ అలీగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. సోమవారం సికింద్రాబాద్ 15వ స్పెషల్ ఎంఎం కోర్టులో హాజరుపర్చగా, ఏడు రోజులు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి రవి శంకర్ తీర్పునిచ్చారు.

గోల్డ్ చైన్, సెల్‌ఫోన్ లాక్కెళ్లిన యువకుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ రమేష్ గౌడ్

అడ్డగుట్ట: రాత్రి సమయాల్లో ఒంటరిగా వెళ్తున్న వారి నుంచి డబ్బు, నగలు, సెల్‌ఫోన్‌లు లాక్కెళ్తున్న పలువురిని లాలాగూడ పోలీసులు రిమాండ్‌కు తరలించారు.. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ గౌడ్ వివరాలు వెల్లడించారు. మల్కాజ్‌గిరిలోని బీజేఆర్ నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ తౌసిఫ్ అలియాస్ గోడా (19) మద్యం, గంజాయికి బానిసై తన నలుగురు స్నేహితుల(మైనర్లు)తో రాత్రుల సమయాల్లో రోడ్లపై బైక్ స్టంట్‌లు చేస్తూ తిరుగుతుంటారు. ఒంటరిగా ఉండే వాళ్లను టార్గెట్ చేసుకొని బెదిరించి డబ్బు, నగలు లాక్కొని ఉడాయిస్తుంటారు. శుక్రవారం అర్ధరాత్రి తార్నాకలోని గణేష్ టెంపుల్ సమీపంలోని బస్టాండ్‌లో దమ్మాయిగూడకు చెందిన వీరేంద్ర నాయుడు అనే వ్యక్తి ఒంటరిగా నిలబడ్డాడు. ఈ క్రమంలో రెండు ద్విచక్ర వాహనాలపై మహ్మద్ తౌసిఫ్‌తో పాటు తన నలుగురు స్నేహితులు వచ్చి అతన్ని బెదిరించి గోల్డ్ చైన్, సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా నిందితులను పట్టుకున్నారు. సోమవారం తౌసిఫ్‌ను రిమాండ్‌కు, మైనర్లు జువైనల్ హోమ్‌కు తరలించారు.

ఎంపీగా గెలిపించండి


పద్మారావుగౌడ్‌కు హారతులు పడుతున్న మహిళలు

బౌద్ధనగర్: అసెంబ్లీ ఎన్నికల్లో అండగా నిలిచారో పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఉండాలని సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం బౌద్ధనగర్ డివిజన్ పార్శిగుటట్లో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంజీవపురం, అశోక్ నగర్, మధుర నగర్‌తో పాటు పలు బస్తీలలో ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను పద్మారావుగౌడ్ అభ్యర్థించారు. గత పది సంవత్సరాలలో సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని ఎంపీగా గెలిపిస్తే మరింతా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రచారంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, ప్రసన్నలక్ష్మి, సునీత, నాయకులు రామేశ్వర్, కిరణ్‌గౌడ్, సుంకు రాంచందర్, రాజేష్, సుమలత, కంది నారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే కుంభకోణాలు


మాట్లాడుతున్న చంద్రశేఖర్ తివారీ

రసూల్‌పురా: అరవై ఐదేళ్ల పాటు కాంగ్రెస్ పాలనలో రూ.12 లక్షల కోట్ల కుంభకోణాలు జరిగాయని బీజేపీ జాతీయ సంఘటన్ కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ ఆరోపించారు. కంటోన్మెంట్ నియోజకవర్గం బొల్లారంలోని జనప్రియ బంగ్లోస్, సరస్వతి నగర్ ప్రాంతాల్లో కాలనీవాసులతో సమావేశమై మాట్లాడారు. బొగ్గు , గడ్డి, భోఫోర్స్ ఇలా చాలా కుంభకోణాలు కాంగ్రెస్ పార్టీ నాయకులకే సాధ్యమైందని అన్నారు. పదేళ్ల మోదీ పాలనలో ఒక్క రూపాయి కూడా అవినీతి జరగలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తున్న ఈటల రాజేందర్, ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించాలని కోరారు. బోర్డు నామినేటెడ్ సభ్యులు జే. రామకృష్ణ, వార్డు అధ్యక్షులు కిరణ్‌కుమార్, జైనపల్లి శ్రీకాంత్, సీనియర్ నాయకులు జేవీ. నర్సింగ్‌రావు, శ్రీనివాస్ రెడ్డి, ఖాదర్ బాషా, లక్ష్మణ్, దుర్గా ప్రసాద్, ప్రవీణ్, సాయిబాబా పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



సనత్‌నగర్: ఎండలు తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా వివిధ కార్యకలాపాలపై రోడ్ల మీదకు వచ్చేవారి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఆవశ్యకత ఎంతో ఉందని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. బేగంపేటలోని సత్యం వెంచర్ ఇంజినీరింగ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సోమవారం సంస్థ అధినేత శ్రీనివాసరావు వడ్లమూడితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ.. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో డీహైడ్రేషన్ కాకుండా శరీరంలో నీటి శాతాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అత్యవసర పనులు, విధి నిర్వహణలో భాగంగా ఎండను సైతం లెక్కచేయకుండా ప్రయాణం చేస్తుంటారని, అలాంటి వారికి అందుబాటులో చలివేంద్రాలను ఏర్పాటుచేసి వారి దాహార్తిని తీర్చడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట ట్రాఫిక్ సీఐ పాపయ్య, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశ ప్రగతి సాధ్యం

చిలకలగూడ : బీజేపీతోనే దేశప్రగతి సాధ్యమని బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి పేర్కొన్నారు. సీతాఫల్‌మండి డివిజన్ అన్నానగర్‌లో కటకం శోభరాణి నేతృత్వంలో సోమవారం జరిగిన బూత్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి గెలుపు ఖాయమని, మెజార్టీపైనే దృష్టి సారించాలని సూచించారు. అవినీతి, అక్రమాలకు నిలయాలైన బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు గుణపాఠం చెప్పాలన్నారు. అనంతరం బీజేపీ ఎన్నికల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అంబాల రాజు, ఈఎల్ ప్రతాప్‌కుమార్, పవన్, సురేష్, కుమార్, వెంకటేశ్వర్లు, నాగరోమణి పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయానికి ప్రచారం

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థుల కోసం ఈ నెల నుంచి ప్రచారం చేపట్టనున్నట్లు మాదిగ నవ నిర్మాణ సమితి (ఎంఎన్ఎస్) రాష్ట్ర అధ్యక్షులు పాల్వాయి నగేష్ తెలిపారు. సోమవారం ఎంఎన్ఎస్, ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్రను ఆయన ప్రారంభించారు. పది సంవత్సరాలు పరిపాలించిన బీజేపీ ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేపట్టలేదని ఎన్నికలు రాగానే రాజకీయ ప్రయోజనాల కోసం వర్గీకరణ ఎజెండాను ముందు పెట్టిందన్నారు.

తెలంగాణ ప్రజా పార్టీ ఆవిర్భావం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వేదికగా తెలంగాణ ప్రజా పార్టీ (టీపీపీ) ఆవిర్భావించింది. సోమవారం ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్ హాల్లో జరిగిన సమావేశంలో విద్యార్థి నేతలు, అధ్యాపకులు పార్టీ ఆవిర్భానికి కారణాలపై చర్చించారు. అనంతరం నీలి రంగు జెండా తెలంగాణ పటంలో సెల్‌ఫోన్ గుర్తుతో పార్టీ లోగోను ఆవిష్కరించారు. కంచెర్ల భద్రి, ప్రొ.గాలి వినోద్‌కుమార్, ప్రొ.ప్రభంజన్ యాదవ్, డా.కొండ నాగేశ్వర్‌రావు, డా.ఎన్‌వీ రావు, నవీన్‌రాజు, రాయదాస్ రాయ్ మంథనీ, డా.నలిగంటి శరత్, షేక్ హనీఫ్, డా, సతీష్ మంథనీ, ప్రొ.రామకృష్ణ , దర్శన్ పాల్గొన్నారు.

రైల్ నిలయంలో అంబేడ్కర్‌కు నివాళి

సాక్షి, సిటీబ్యూరో: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను దక్షిణమధ్య రైల్వే ఆధ్వర్యంలో సోమవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ ఆర్.ధనంజయులు, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ పి.కిషోర్ బాబు ముఖ్య అతిథులుగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

సికింద్రాబాద్: రైలుకింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. బీబీనగర్–ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ల మధ్య ఒక వ్యక్తి మృతదేహం ఉందన్న సమాచారం మేరకు వెళ్లిన పోలీసులకు మృతుడికి సంబంధించిన ఎలాంటి వివరాలు లభించలేదు. సుమారు 25 వయస్సు ఉంటుందని ఒంటిపై బూడిదరంగు చొక్కా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.